సాక్షి ఆదిలాబాద్

ఆదివారం ׀ 26 ׀ మే ׀ 2024



మధురఫలమా..గరళమా!
పండ్లలో రారాజుగా పేరొందిన మామిడి విషతుల్యంగా మారుతోంది. మార్కెట్‌లోకి వచ్చే కాయలను రసాయనాలతో మాగబెడుతున్నారు. 8లో▸



మరమ్మతుల్లో వేగం పెంచాలి
కడెం ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో వేగం పెంచాలని ఈఎన్‌సీ నాగేందర్‌రావు నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
42.0/31.0

వాతావరణం
పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

‘పీడీ కేసులు నమోదు చేయాలి’



మాట్లాడుతున్న బొర్రన్న

ఇచ్చోడ: నకిలీ విత్తనాలు విక్రయిస్తూ రైతులను మోసగిస్తున్న వ్యాపారులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. ఏటా నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన అమాయక గిరిజన, ఆదివాసీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ క్రమంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అలాగే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రైతులు విష్ణు, ప్రకాశ్, రాము, ఆనందర్‌రావు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌లో కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారి సునితకుమారి ప్రకటనలో తెలిపారు. సర్కారు పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండి 10వ తరగతి చదివి 7.0 ఆపై జీపీలు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సెస్సీ మెమో, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఐదు పాస్ పోర్టు ఫొటోలు, ఆధార్ కార్డు, బోనఫైడ్ వంటి ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు సమయంలో అందజేయాలని పేర్కొన్నారు.

1200 మందికి ‘గొర్రెల’ డీడీలు వాపస్

కైలాస్‌నగర్: సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం గొల్ల, కుర్మలు చెల్లించిన డీడీలను పశుసంవర్ధకశాఖ తిరిగి వారికి అందజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల యూనిట్లను అందించేందుకు సుముఖంగా లేకపోవడం, తమ డీడీలు తమకు తిరిగి ఇచ్చేయాలంటూ గొల్ల, కుర్మలు ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు వాటిని తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించారు. డీడీలను వెనక్కి ఇచ్చే ప్రక్రియ ఇటీవల ప్రారంభించగా అది కొనసాగుతోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1200 మందికి డీడీలను తిరిగి అందజేసినట్లుగా జిల్లా ఇన్‌చార్జి పశుసంవర్ధకశాక అధికారి కిషన్ తెలిపారు. మరో 512 మంది మిగిలి ఉన్నారని త్వరలోనే వారికి కూడా ఇచ్చేస్తామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన ప్రథమ సంవత్సరం ఆంగ్లం పరీక్షకు 1,372 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1309 మంది హాజరయ్యారు. 63 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1,162 మందికి గాను 1090 మంది హాజరయ్యారు. 72 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్ కుమార్ ప్రకటనలో తెలిపారు.

రాజశ్యామల మహాయాగం ప్రారంభం



యాగం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీనారసింహస్వామి యోగీశ్వర పీఠంలో రాజశ్యామల మహాయాగం శనివారం ప్రారంభమైంది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ లోక కల్యాణార్థమై ప్రారంభమైన ఈ క్రతువు సోమవారం వరకు కొనసాగనుంది. తొలిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ పూజ, శత చండీ పారాయణం, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం పూజలు చేపట్టారు. ఇందులో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్, నిర్వాహకులు తదితరులున్నారు.



జనం లేక బోసిపోయి దర్శనమిస్తున్న ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్లు.. డౌన్!

- గతేడాదితో పోల్చితే 1,342 తక్కువగా నమోదు
- సర్కారు ఖజానాకు రూ.7.3 కోట్ల ఆదాయం లాస్
- ఎన్నికల ప్రభావంతో తగ్గిన క్రయ, విక్రయాలు

కైలాస్‌నగర్: జిల్లాలో రిజిస్ట్రేషన్లు గతేడాదితో పోల్చితే ఈ ఏడాది భారీగా తగ్గాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతగా లేకపోవడంతో భూములు, ప్లాట్లు, ఇళ్ల క్రయ, విక్రయాలు ఆశించిన స్థాయిలో జరగలేదని తెలుస్తోంది. జిల్లాలో ఉన్న రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి. ఉదయం 11 నుంచి సాయంత్రం 6.30గంటల వరకు సందడిగా కనిపించే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రస్తుతం మధ్యాహ్ననికే బోసిపోతున్నాయి. ఉద్యోగులు ఖాళీగా కూర్చోవాల్సి రావడం పరిస్థితికి అద్దం పడుతుంది. ఈ ప్రభావం సర్కారు ఖజానాపై తీవ్రంగా పడుతోంది.

తగ్గిన 1,342 రిజిస్ట్రేషన్లు

జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 1,342 రిజిస్ట్రేషన్లు తగ్గాయి. దీంతో ఆ శాఖకు సుమారు రూ.7.3కోట్ల ఆదాయం తగ్గినట్లైంది. కార్యాలయాల వారీగా పరిశీలిస్తే.. బోథ్ కార్యాలయ పరిధిలో 2023 జనవరి 1నుంచి మే 31వరకు 501 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. రూ.96.60 లక్షల ఆదాయం సమకూరింది. అదే ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 24 వరకు 372 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. వీటి ద్వారా రూ.54 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. గతేడాదితో పోల్చితే 129 రిజిస్ట్రేషన్లు తక్కువగా నమోదు కావడంతో రూ.42.60లక్షల ఆదాయం తగ్గింది. నిత్యం రద్దీగా ఉండే ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోనూ ఇదే పరిస్థితి. గతేడాది ఐదు నెలల వ్యవధిలో 5,165 రిజిస్ట్రేషన్లు నమోదవగా రూ.17.76కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది 3,952 రిజిస్ట్రేషన్లు కాగా రూ.11.14కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 1,213 రిజిస్ట్రేషన్లు తక్కువగా కావడంతో ప్రభుత్వానికి రూ.6.61కోట్ల ఆదాయం తగ్గిపోయింది.

ఎన్నికల ప్రభావమే కారణం

జిల్లాలో రిజిస్ట్రేషన్లు తగ్గిపోవడానికి గతేడాది జరిగిన అసెంబ్లీ, ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల ప్రభావమే కారణమని ఆ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. భూములు, ప్లాట్లు, ఇళ్ల క్రయ, విక్రయాలు జరిపే వారిలో ఎక్కువగా రాజకీయ నాయకులు, వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులే ఉంటారు. వీరంతా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమై ఉండటంతో భూముల క్రయ, విక్రయాలు ఆశించిన స్థాయిలో జరుగలేదని తెలుస్తోంది. కోడ్ అమలు కారణంగా నగదు తరలింపు అరికట్టేందుకు యంత్రాంగం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో వాటిని కొనుగోలు చేయాలని భావించినప్పటికీ అందుకు సంబంధించిన నగదు తీసుకెళ్లే అవకాశం లేకపోవడం, ఒకవేళ పట్టుబడితే అప్పటికప్పుడు ఆధారాలు చూపించే పరిస్థితి లేకపోవడంతో చాలామంది క్రయ, విక్రయాలపై ఆసక్తి చూపలేదు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం తిరిగి పుంజుకునే అవకాశముంటుందని భావిస్తున్నారు.

జిల్లాలో గడిచిన రెండేళ్లుగా జనవరి నుంచి మే వరకు నమోదైన రిజిస్ట్రేషన్లు, సమకూరిన ఆదాయం వివరాలు ఇలా..

ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో..

	2023లో		2024లో	
నెల	రిజిస్ట్రేషన్లు	ఆదాయం(రూ.లక్షల్లో)	రిజిస్ట్రేషన్లు	ఆదాయం(రూ.లక్షల్లో)
జనవరి	975	339.3	669	221.45
ఫిబ్రవరి	990	382.8	762	251.82
మార్చి	1261	404.52	847	226.86
ఏప్రిల్	907	295.2	905	211.58
మే	1,032	354.9	769	202.72
బోథ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో..				
జనవరి	63	9.0	74	14.0
ఫిబ్రవరి	90	17.6	93	14.0
మార్చి	110	24.0	86	13.0
ఏప్రిల్	137	31.0	57	6.0
మే	101	15.0	62	7.0

ఎన్నికల ప్రభావంతోనే..



జిల్లాలో గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రిజిస్ట్రేషన్లు కొంత మేర తగ్గాయి. ఇందుకు ఎన్నికల ప్రభావమే కారణం. కోడ్ కారణంగా భూములు, ప్లాట్లు, ఇళ్ల క్రయ, విక్రయాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా తగ్గిపోయింది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత తిరిగి పుంజుకునే అవకాశముంటుంది.
– అశోక్, సబ్‌రిజిస్ట్రార్, ఆదిలాబాద్

ఫిర్యాదు.. రూటు మారింది!



బేల మండలం కాంగార్‌పూర్‌లో ఇసుక అక్రమ క్వారీ

- కంప్లయింట్ నేరుగా హైదరాబాద్ స్థాయిలోనే..
- అక్రమ ఇసుకదందాపై జనం వ్యవహరిస్తున్న తీరు
- అధికారుల తీరుపై సర్వత్రా అనుమానాలు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదుల రూటు మారింది. కంప్లయింట్లు నేరుగా హైదరాబాద్ స్థాయికి చేరుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇసుకాసురులతో ఇక్కడి అధికారులు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 22న ఓ మైనింగ్ అధికారి అసిస్టెంట్‌తో కలిసి బేల మండలంలోని కాంగార్‌పూర్ అక్రమ ఇసుక క్వారీ తనిఖీ కోసం వెళ్లారు. వారు వెళ్లిన సమయంలో ఆ సైట్‌లో ఇసుక తోడే మరబోటు లేదు.. పైపుల సెట్టింగ్, తవ్వే కూలీలూ కనిపించలేదు.. ట్రాక్టర్లు, టిప్పర్లు, జేసీబీల జాడ సైతం లేకుండా పోయింది.. పెన్‌గంగ నిశ్శబ్ద వాతావరణంలో ఉంది. ఆదిలాబాద్ నుంచి వచ్చే దారిలో తమ వాహనాన్ని ముందే పసిగట్టి ఎవరో లీక్ చేయడంతో ఇలా జరిగిందని వారు చెప్పుకుంటున్నారు. అలాంటప్పుడు ఎత్తులకు పైఎత్తులు వేయాల్సిన అధికారులు ఎందుకు డీలా పడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఆకస్మిక తనిఖీకి వచ్చేవారు తమ రెగ్యులర్ వాహనం కాకుండా మరో వాహనంలో వచ్చేదని, చిత్తశుద్ధి ఉంటే మైనింగ్ జరిగే సమయంలో నేరుగా దాడులు చేయాల్సిందని అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా ఆ శాఖ అధికారులే ముందుగా లీక్ ఇచ్చి క్వారీ నిర్వాహకులను అలర్ట్ చేశారనే విమర్శ కూడా లేకపోలేదు.

పైకే ఫిర్యాదులు..

కాంగార్‌పూర్‌లో అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని కొంత మంది ఇటీవల హైదరాబాద్ స్థాయిలో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 22న మైనింగ్ అధికారులు తనిఖీ కోసం వచ్చారని తెలిసింది. ఇక్కడి ఆఫీసర్లు మాత్రం పైకి కంప్లయింట్ చేసిన విషయాన్ని మాత్రం బయటకు చెప్పలేని పరిస్థితి. అయితే ఆ రోజు మైనింగ్ అధికారులు సైట్‌కు వచ్చి వెళ్లిన తర్వాత అక్కడి జనంలో ఈ రకమైన చర్చ సాగుతోంది. దీని బట్టే ఫిర్యాదు జిల్లా స్థాయిలో చేసిన పక్షంలో స్పందన రావడం లేదనే నమ్మకం స్థానికుల్లో బలంగా నాటుకుపోయింది. ఈ నేపథ్యంలోనే ఫిర్యాదు రూట్ మారిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

జిల్లాలో పెన్‌గంగ పరీవాహక ప్రాంతం 70 కిలోమీటర్ల పైబడి మహారాష్ట్రకు సరిహద్దుగా ఉంది. ఈ పరీవాహక ప్రాంతం భీంపూర్, జైనథ్, బేల మండలాల పరిధిలోకి వస్తుంది. సుమారు 12 నుంచి 15 క్వారీల నిర్వహణ పలుసైట్లలో జరుగుతుంది. ప్రధానంగా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు దీన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. అయితే వారు ప్యాకేజీలు, నెలవారీ ఫిక్స్‌డ్ మామూళ్లతో నిండా మునిగిపోయారనే అపవాదు లేకపోలేదు. ఇది వరకు ఓ మైనింగ్ ఆఫీసర్‌కు క్వారీ నిర్వాహకులు ఏకంగా ఖరీదైన కారును గిఫ్ట్‌గా ఇచ్చారనే ప్రచారం ఉంది. ఈ ఆమ్యామ్యాలు మితిమీరడంతో గతంలో భీంపూర్ మండలం వడూర్‌లో ఓ క్వారీ నిర్వాహకుడు ఏకంగా సైట్‌నే క్లోజ్ చేసుకున్నాడనే ప్రచారం ఉంది. ప్రధానంగా వీటి విషయంలో ఆఫీసర్లు ప్రతీ నెల నిక్కచ్చిగా ఉండడం, దీన్ని అవకాశంగా తీసుకుని క్వారీలో ఇసుక దోపిడీ తీవ్రం చేయడం నిర్వాహకులకు అందేవేసిన చేయిగా మారిందని పలువురు చెప్పుకుంటారు. అయితే అడపాదడపా తనిఖీలు చేస్తూ ఇసుక రవాణా వాహనాలను సీజ్ చేస్తూ జరిమానా విధించడం ద్వారా సర్కారుకు ఆదాయం తీసుకవస్తున్నామనే బిల్డప్ చేయడంలో వీరిని మించిన వారుండరని జనం నవ్వుకునే పరిస్థితి ఉంది. మైనింగ్ అధికారుల తనిఖీల విషయంలో ఆ శాఖ ఇన్‌చార్జి ఏడీ రవీందర్‌ను ‘సాక్షి’ వివరణ కోరేందుకు ఫోన్లో యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ప్యాకేజీలు, నెలవారీ మామూళ్లు..

రవాణాశాఖ తనిఖీలు

- రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల సీజ్

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలు పాటించని రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. ‘ప్రైవేట్ బస్సు.. డేంజర్’ శీర్షికన శనివారం ‘సాక్షి’లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ మేరకు రవాణాశాఖ అధికారులు స్పందించారు. జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. గెలాక్సీ బస్సులను తనిఖీ చేయగా పర్మిట్ లేకపోవడం, హైదరాబాద్‌కు చెందిన మరో బస్సు ట్యాక్స్ చెల్లించలేనట్లుగా గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఈ రెండు బస్సులను సీజ్ చేసి వాటిని డిపోకు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖ అధికారి శివపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రావెల్స్‌లో గూడ్స్ సామగ్రి తీసుకురావడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ట్యాక్స్, పర్మిట్, ఫిట్‌నెస్ తదితర వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంవీఐ అశ్వంత్ తదితరులున్నారు.



ప్రైవేట్ బస్సు.. డేంజర్!

సాక్షిలో ప్రచురితమైన కథనం

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి



రికార్డులు పరిశీలిస్తున్న మీనా రామనాథన్

ఆదిలాబాద్‌టౌన్: వినియోగదారుల సమస్యల పరిష్కానికి కృషి చేయనున్నట్లు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ రాష్ట్ర ఇన్‌చార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కమిషన్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు అంశాలపై సూచనలు చేశారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగానే కార్యాలయాన్ని పరిశీలించినట్లుగా తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్‌తో పాటు పలువురు న్యాయవాదులు ఆమెను సన్మానించారు. ఇందులో వినియోగదారుల కమిషన్ జిల్లా చైర్మన్ జాబెజ్ శ్యామూల్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 6,32,446 విత్తన ప్యాకెట్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లావ్యాప్తంగా 280 మంది విత్తన డీలర్ల వద్ద 6,32,446 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య ప్రకటనలో తెలిపారు. రైతులు ఆందోళన చెందకుండా సమీపంలోని దుకాణాలను సంప్రదించి విత్తనాలు కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. డీలర్లు ఎవరైనా ఎంఆర్‌పీకి మించి విక్రయించినా, విత్తనాలు అందుబాటులో ఉండి కూడా లేవని చెప్పినా వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

‘ఆర్డర్ కాపీలు సరే.. పోస్టింగ్‌లు ఎప్పుడు?’

నేరడిగొండ: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ పోస్టులకు సంబంధించి ఆర్డర్ కాపీలు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వడం లేదని గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురుకులాల్లో ఎంపికైన అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఆర్డర్ కాపీలు ఇచ్చినా ఇంకా పోస్టింగ్ కల్పించడం లేదని పేర్కొన్నారు. అలాగే స్టాఫ్ నర్సుల ఉద్యోగాలను భర్తీ చేసినప్పటికీ వారికి సైతం నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జై హనుమాన్..



హనుమాన్ నామస్మరణతో పట్టణ వీధులు మారుమోగాయి. జిల్లా కేంద్రంలోని శ్రీరామ్ లీలామైదాన్ హనుమాన్ ఆలయం నుంచి హనుమాన్ దీక్షాదారులు శనివారం పల్లకి శోభాయాత్ర చేపట్టారు. ముందుగా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రామన్న, శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. – ఆదిలాబాద్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



తనిఖీ చేస్తున్న సీఐ సాయినాథ్, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

బేల: ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలని జైనథ్ సీఐ సాయినాథ్ అన్నారు. మండల కేంద్రంలోని విత్తన విక్రయ కేంద్రాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు చేపట్టారు. విత్తన ప్యాకెట్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. జిల్లా కేంద్రంలో ఇటీవల గుర్తించిన నకిలీ విత్తనాలకు సంబంధించి ఆయా కంపెనీల ప్యాకెట్లు అమ్మవద్దన్నారు. పలు కంపెనీల శాంపిల్స్ సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్ర రైతులకు ఇక్కడి విత్తనాలు విక్రయించవద్దని డీలర్లను ఆదేశించారు. అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో భాగంగా మహారాష్ట్ర రైతులకు పత్తి విత్తనాలు విక్రయించిన 24మంది డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఏవో విశ్వామిత్ర తెలిపారు. ఇందులో ఎస్సై రాధిక, ఏఎస్సై జీవన్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలప స్వాధీనం



పట్టుకున్న కలపతో అటవీ అధికారులు

సిరికొండ: మండల కేంద్రంలోని రవి ఇంటి వద్ద ఉన్న కలపను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీరయ్య తెలిపారు. సిరిచెల్మ రేంజ్ ఆఫీసర్ గణేశ్‌కు అందిన సమాచారంతో దాడిచేసి రూ.30 వేల గల అక్రమ కలప దుంగలు, యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నామని గీరయ్య తెలిపారు.

మోసం చేసిన భార్యభర్తలపై కేసు

ఖానాపూర్: అమెరికాలో ఉంటున్న వ్యక్తి ఏటీఏం కార్డుతో డబ్బులు డ్రా చేసి సొంతానికి వాడుకుని మోసగించిన భార్యభర్తలపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని భర్కత్‌పుర కాలనీకి చెందిన అసద్ అలీ అమెరికాలో ఉంటున్నాడు. ఖానాపూర్‌లో ఆయన తల్లిదండ్రుల బాగోగులు, హాస్పిటల్, ఇతర ఖర్చుల కోసం అదేకాలనీకి చెందిన షర్జిల్ అహ్మద్‌కు రెండేళ్ల క్రితం అసద్‌అలీ తన ఏటీఎం కార్డు ఇచ్చాడు. షర్జిల్ అహ్మద్ తోపాటు అతని భార్య హుమేరా యాస్మిన్ ఆ డబ్బులు కాజేయాలనే దురుద్దేశంతో బ్యాంక్ మేసెజ్ అలర్ట్ నంబర్‌ను మార్పించారు. రూ.60 లక్షలు విత్‌డ్రా చేసి సొంతానికి వాడుకున్నారు. ఈ విషయం తెలిసి నిలదీస్తే రూ.12 లక్షల విలువైన ప్లాట్ ఇచ్చారని, రూ.48 లక్షలు చెల్లిస్తామని ప్రామిసరీనోటు రాశారు. ఎంతకీ చెల్లించకపోవడంతో అసద్ అలీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారికి రక్తమార్పిడి

మంచిర్యాలటౌన్: జన్నారంలో చెత్తకుండీలో పడేసిన శిశువును బాలల సంరక్షణ అధికారులకు అప్పగించగా మంచిర్యాలలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నారి శరీరంలో రక్తం తక్కువగా ఉండడంతో ఉమెన్ అండ్ చైల్డ్ జిల్లా కోఆర్డినేటర్ ప్రేమ ద్వారా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి శిశువుకు అవసరమైన గ్రూప్ రక్తాన్ని ఉచితంగా అందజేశారు. రక్తమార్పిడి తర్వాత మాతాశిశు కేంద్రానికి వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.

రైస్‌మిల్లు తనిఖీ

నెన్నెల: మండలంలోని నందులపల్లి గ్రామ శివారులో ఉన్న శ్రీలక్ష్మీ శ్రీనివాస రైస్‌మిల్లులో ధాన్యం దిగుమతి ప్రక్రియను శనివారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తనిఖీ చేశారు. రైస్ మిల్లర్లు ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతంగా పూర్తి చేయాలని, ధాన్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, మిల్లుల వద్ద ఎలాంటి కోత విధించకూడదని యాజమాన్యానికి సూచించారు. మిల్లులకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సబ్బ రమేశ్, తదితరులు ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీషైన్ ఆస్పత్రి వద్ద శుక్రవారం రాత్రి ఫర్నీచర్ విషయంలో డాక్టర్ నవ్య, స్థానిక నివాసి శ్రీనివాస్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సైలు సోనియా, అంజన్న సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. డాక్టర్ నవ్యకు తలకు గాయం కావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని రూరల్ సీఐ అల్లం రాంబాబు తెలిపారు.

మధురఫలమా.. గరళమా!

- నోరూరించే మామిడిపండ్లు విషతుల్యం
- తి(కొ)నే ముందు అప్రమత్తత అవసరం
- కాల్షియం కార్బైడ్‌తో మగ్గుతున్న పండ్లు
- ఆరోగ్యానికి హానికరమంటున్న వైద్య నిపుణులు



రసాయనాలతో పక్వానికి తెచ్చిన మామిడిపండ్లు

నిర్మల్‌ఖిల్లా: పండ్లలో రారాజుగా పేరొందిన మామిడి విషతుల్యంగా మారుతోంది. మార్కెట్‌లోకి వచ్చే కాయలను రసాయనాలతో కృత్రిమంగా మాగబెడుతున్నారు. నిషేధిత కాల్షియం కార్బైడ్ ఇతర ప్రమాదకర రసాయనాలను వ్యాపారులు విరివిగా వినియోగిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మంచిర్యాల చుట్టుపక్కల మామిడితోటల నుంచి కాయలు జిల్లాకు దిగుమతి అవుతున్నాయి. నిషేధిత కార్బైడ్ రసాయనాలు వినియోగించి ఎక్కువ ధరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ పండ్లను తినడంతో అనేక అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మాగబెట్టిన పండ్లను గుర్తించండిలా..

మామిడి కాయలను కార్బైడ్ ద్వారా మాగబెట్టినవి గుర్తించడానికి నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. ఈ పండ్లపై ఆకుపచ్చని మచ్చలు, పసుపు వర్ణం ఎక్కువగా ఉంటుంది. సహజసిద్ధంగా మాగితే ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులు కలిసినట్టుగా ఉంటాయి. పండును కోసినపుడు గుజ్జు ఎరుపు, పసుపు కలిసినట్టుగా ఉంటుంది. పండ్లలో రసం ఎక్కువ, తొడిమ లోపటికి కుంగినట్టుగా ఉంటుంది. ప్రజలు పండ్లను కొనుగోలు చేసేముందు అప్రమత్తంగా ఉండాలి.

జిల్లాలో తగ్గిన దిగుబడి..

జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షాలకు మామిడి పండిస్తున్న రైతులు నష్టానికి గురయ్యారు. ఉద్యానవన శాఖ అంచనా ప్రకారం.. జిల్లాలో 2,744 ఎకరాల్లో మామిడి పంటను రైతులు సాగు చేశారు. ఇందులో అకాల వర్షాలకు 671 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నట్లు అధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో 486 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏటా రావల్సిన దిగుబడి ఈసారి తగ్గింది. వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి మామిడి దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

ఇథిలీన్‌పై అవగాహన ఏది?

రసాయనాలతో పండించిన మామిడి అనారోగ్యానికి కారణమవుతుందని అప్పటి ఏపీ హైకోర్టు నిషేధించింది. ఇథలీన్ వాయువు ద్వారా పండ్లు మాగబెడితే ఆరోగ్యకరమని కేంద్రం గతంలో ప్రకటించింది. మాగబెట్టే గదులను ఉపయోగించాలని తెలిపింది. ఇందుకోసం రైపనింగ్ చాంబర్ల ఏర్పాటు కోసం రాయితీ కల్పిస్తోంది. ఇథలీన్ వాడకం, రైపనింగ్ చాంబర్ల ఏర్పాటుపై అధికారులు అవగాహన కల్పించడం లేదు. ఇథలీన్ గ్యాస్‌ను వదిలి పండ్లను మూడు రోజులపాటు మాగబెడితే సహజసిద్ధంగా ఉంటాయి. మంచి రంగుతోపాటు రుచి ఉంటుంది.



పండ్లను కృత్రిమంగా పక్వానికి తెచ్చే రసాయనం ఇదే

ఇథలీన్ గ్యాస్‌తో ఖర్చు పెరుగుతుందని ఉపయోగించడం లేదని తెలుస్తోంది.

ఆరోగ్యానికి హానికరం



రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లు తింటే అనేక ఆరోగ్య సమస్యల బారిన పడే ప్రమాదముంది. జీర్ణ సంబంధిత వ్యాధులు, కాళ్ల చేతులు, తిమ్మిర్లు, నరాల బలహీన తలకు గురయ్యే అవకాశం ఉంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధకత తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి. గర్భిణుల్లో హార్మోన్లు దారితప్పుతాయి. సహజపద్ధతిలో పండిన పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

– డాక్టర్ ఎస్.శశికాంత్, ల్యాప్రోస్కొపిక్ సర్జన్, నిర్మల్

బాసరలో భక్తుల రద్దీ



భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవుల్లో అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని ఈవో విజయరామారావు తెలిపారు.

కనువిందు చేస్తున్న వృక్షాలు



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ సమీప అటవీ ప్రాంతంలో ఈ వృక్షాలు కనువిందు చేస్తున్నాయి. చెట్లకొమ్మలకు ఆకులు రాలిపోయి కొత్తగా చిగురిస్తున్నాయి. ఈ సమయంలో ఆ కొమ్మలు ఆకాశం వైపు ఉన్నా దృశ్యాలు పలువురినీ ఆకట్టుకుంటున్నాయి.

అధికారులతో ట్రిపుల్‌ఐటీ వీసీ సమీక్ష



సమావేశంలో పాల్గొన్న వీసీ వెంకటరమణ, తదితరులు



ట్రిపుల్‌ఐటీలో పర్యటిస్తున్న వీసీ ప్రొఫెసర్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. జూన్ 5 నుంచి యూనివర్సిటీ ప్రారంభం కానున్ననేపథ్యంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చే సమయంనాటికి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో పర్యటించారు. తరగతి, హాస్టల్ గదుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. ట్రిపుల్‌ఐటీలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు లేకుండా చేయాలని తెలిపారు. నీటి సమస్యలేకుండా చేయాలన్నారు. హాస్టల్ గదుల్లో ఏవైన మరమ్మతులు ఉంటే పూర్తిచేయాలన్నారు.ట్రిపుల్‌ఐటీలో శాఖల అధికారులతో నివేదికలు తెప్పించుకున్నారు.

నకిలీ విత్తనాల కేసులో ఇద్దరి రిమాండ్

- మరో వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ ప్రాంతంలో ఓ గోదాంలో ఓ ముఠాను అక్రమంగా నకిలీ విత్తన ప్యాకెట్లు తయారు చేస్తూ పోలీసులకు శుక్రవారం పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఆదిలాబాద్‌లోని హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న జైనథ్ మండలం పెండల్‌వాడకు చెందిన అశోక్‌రెడ్డి, హైదరాబాద్‌లో ఉన్న కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంటకు చెందిన అప్పాల రాజేందర్‌ను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మరొకరు సిద్దిపేటకు చెందిన మణికంఠ ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. వీరు గతంలో వివిధ విత్తనాల కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారు. ఆ అనుభవంతోనే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి లూజ్ విత్తనాలు తీసుకువచ్చి వివిధ కంపెనీల బ్రాండ్ల పేరుతో ప్యాకెట్లు తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఎక్కడైన విత్తనాలు విక్రయించారా, స్టాక్ ఎక్కడైనా ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం.

వృద్ధుడు ఆత్మహత్య

కౌటాల: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్తంపేటకు చెందిన కారెంపెంటు (64) శనివారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఎస్.మధుకర్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిర్పూర్(టి)సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పురుగుల మందుతాగి..

కోటపల్లి: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పార్‌పల్లికి చెందిన నామని సురేశ్ (42) కొంతకాలంగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతుండేవాడు. శనివారం ఇంట్లో పురుగుల మందు తాగడంతో అతని భార్య రజిత గమనించి 108కు సమాచారం అందించింది. ముందుగా చెన్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కాంతారావు తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఇంద్రవెల్లి: చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని యావత్‌మాల్‌కు చెందిన కుడ్మేత నితిన్ (40) బంధువులతో కలిసి గురువారం ఇంద్రవెల్లి మండలం గిన్నెర పంచాయతీ పరిధి తోయగూడలో కనక వంశీయులు నిర్వహించిన కులదేవత పూజలకు హాజరయ్యారు. శుక్రవారం ఉదయం బంధువులతో కలిసి స్నానం కోసం చెరువు వద్దకు వెళ్లారు. నితిన్ బహిర్భూమికని చెప్పి కొంత దూరం వెళ్లాడు. బంధువులు స్నానాలు పూర్తయినా ఎంతసేపటికి రాలేదు. అనుమానం వచ్చి గాలించగా ఒడ్డు పక్కనే నితిన్ బట్టలు ఉండడం, అనుమానంతో గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్లను చెరువులో గాలించి నితిన్ మృతదేహాన్ని బయటకు తీశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.



నితిన్ మృతదేహం

హార్వెస్టర్ పడి ఒకరు మృతి

నర్సాపూర్(జి): హార్వెస్టర్ పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు..మండల కేంద్రానికి చెందిన దర్శనం కనకయ్య (42) శనివారం హార్వెస్టర్ నుంచి ట్రాక్టర్‌ను విడదీసే క్రమంలో రెండు జాకీలు అమర్చుతుండగా ప్రమాదవశాత్తు జారి అతని మెడపై పడింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు జేసీబీ సహాయంతో యువకుడిని బయటకు తీసి అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య సాయవ్వ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోర్సినిలో ఒకరు దారుణహత్య

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోర్సినిలో శుక్రవారం రాత్రి ఒకరు దారుణహత్యకు గురైనట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. గ్రామంలో కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్న బొట్టుపల్లి సదయ్య (34) శుక్రవారం రాత్రి ముల్కల రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో రాజ్‌కుమార్ ఇనుప పైపుతో తలపై కొట్టగా సదయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి బొట్టుపల్లి మల్లక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఓటు కోసం హస్తినకేగి..

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, నవలా రచయిత, ఢిల్లీలోని కెనడా రాయబార కార్యాలయంలో రెండు దశాబ్దాలకు పైగా విధులు నిర్వహించిన విశ్రాంత ఉద్యోగి డాక్టర్ టి.సంపత్‌కుమార్ ఓటు హక్కు వినియోగం కోసం ఢిల్లీ వెళ్లారు. 6వ దశ ఎన్నికల్లో భాగంగా శనివారం ఢిల్లీలో పోలింగ్ నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి డాక్టర్ టి.సంపత్ కుమార్-మాధవీలత దంపతులు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలోని ద్వారక ఇంటర్నేషనల్ స్కూల్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలంపాటు కెనడీయన్ కార్యాలయంలో ఉన్నతస్థాయి అధికారిగా విధులు నిర్వహించినందున తనకు ఓటు అక్కడే ఉందని తెలిపారు. ఓటును కచ్చితంగా వినియోగించుకోవాలని దంపతులు ఢిల్లీకి వెళ్లడం స్ఫూర్తినిచ్చే అంశం.



ఓటుహక్కును వినియోగించుకున్నట్లు సిరాచుక్కను చూపుతున్న సంపత్‌కుమార్ దంపతులు

'కడెం' మరమ్మతుల్లో వేగం పెంచాలి

- ఈఎన్‌సీ నాగేందర్‌రావు

కడెం: కడెం ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో వేగం పెంచాలని ఆపరేషన్ అండ్ మెంటెనెన్స్ ఇంజనీరింగ్ చీఫ్(ఈఎన్‌సీ) నాగేందర్‌రావు నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు మరమ్మతు పనులను శనివారం పరిశీలించారు. పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలన్నారు. రెండేళ్లుగా భారీ వరదలతో ప్రాజెక్టు డేంజర్ జోన్‌లోకి వెళ్లిందని పేర్కొన్నారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేయించి, వానాకాలం సీజన్‌కు ప్రాజెక్టును సిద్ధం చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈఎన్‌సీ వెంట ఎస్ఈలు సంజీవ్, రవీందర్‌రావు, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈలు రవినాయక్, సర్వర్, ప్రాజెక్టు సిబ్బంది ఉన్నారు.



కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ

లోకారి(బి)ని సందర్శించిన అధికారులు

నార్నూర్: గాదిగూడ మండలం లోకారి(బి) గ్రామంలో శుక్రవారం కలుషిత నీరు తాగి 20 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఐటీడీఏ ఏవో రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో రమేశ్‌లు శనివారం లోకారి(బి) గ్రామాన్ని సందర్శించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. వాంతులు, విరోచనాలకు కారణమైన తాగునీటి బావిని పరిశీలించారు. కలుషిత నీరేనా? ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ జరిపారు. గత 30 ఏళ్లుగా ఆ బావినీటిని గ్రామస్తులు తాగుతున్నారని గ్రామపెద్దలు మేస్రం శేఖర్ వివరించారు. ఎండలోనే పలువురు ఉపాధి, వ్యవసాయ పనులకు వెళ్లారని, ఈ క్రమంలో కొందరికి వాంతులు విరోచనాలైనట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వాంతులు విరోచనాలకు ఎండ తీవ్రతతో పాటు నీరు కారణమన్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. గ్రామాల్లో భగీరథ నీళ్ల తాగకుండా బావినీటినే తాగుతూ అనారోగ్యానికి గురవుతున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాహుల్, హెల్త్ సూపర్‌వైజర్ ఆడే సంజీవ్ ఉన్నారు.



తాగునీటి బావిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఐటీడీఏ ఏవో, డీఎల్‌పీవో

పొద్దంతా రెక్కీ.. రాత్రంతా చోరీ

- ఏడుగురు సభ్యుల దొంగల ముఠా అరెస్టు
- రూ.11.72 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల్లా పొద్దంతా కాలనీల్లో సంచరిస్తూ రెక్కీ నిర్వహించడం, తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగల ముఠాను ఎట్టకేలకూ మంచిర్యాల పోలీసులు పట్టుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు స్థానిక ఎం.కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో ఏడుగురు ముఠాగా ఏర్పడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని మంచిర్యాల, హాజీపూర్, సీసీసీ నస్పూర్, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, మందమర్రి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన సొత్తును శనివారం ముఠా సభ్యుడైన గన్నారం మధుకర్ ద్వారా కరీంనగర్‌లో విక్రయించేందుకు మరో సభ్యుడు స్థానిక గాంధీనగర్‌కు చెందిన తాటికొండ స్వామిచరణ్ ఇంటివద్ద సభ్యులంతా కలిసి సమావేశమయ్యారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన పోలీసులు వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9.22 లక్షల విలువైన బంగారు, రూ.60 వేల విలువైన వెండి ఆభరణాలు, బైక్, రూ.1.20 లక్షల విలువైన ఎల్ఈడీ హోంథియేటర్, రూ.20 వేల విలువైన గిటార్ స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసులు

అంతా 22 ఏళ్ల లోపువారే...

సీసీసీ ప్రశాంత్ నగర్‌కు చెందిన పాగిడి కార్తీక్ (19), జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన తాటికొండ స్వామిచరణ్ (19), బెల్లంపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పుప్పాల రాహుల్ (19), నస్పూర్ మండలం సుందరయ్య కాలనీకి చెందిన గన్నారం మధుకర్ (20), కుమురంభీం జిల్లా కాసిపేట మండలానికి చెందిన కుర్సింగ ఈశ్వర్ (20), తిర్యాణికి చెందిన మడావి రాము (22), తిర్యాణి మండలం కన్నెపెల్లికి చెందిన వెడ్మ ప్రవీణ్(22)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ వెల్లడించారు. ముఠాను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ బన్సీలాల్, సహకరించిన స్పెషల్‌పార్టీ సిబ్బంది, ఎస్సైలను సీపీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు. సమావేశంలో స్థానిక ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.